
సాక్షి బాపట్ల

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



42.57 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 33,306 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 42.57 టీఎంసీలు.



పవిత్రోత్సవాలు ప్రారంభం

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురారోహణతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.



41,775 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,880 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,775 బస్తాలు విక్రయించారు.

పేద విద్యార్థులకు నష్టం



మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వాటిని సీఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. పేదలకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలి. ఎన్ఎంసీ అనుమతి ఇస్తే మాకు వద్దు, మేం అడ్మిషన్లు జరపలేం అంటున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే. పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది.

– సీహెచ్ సునీత,
నీట్ రాసిన విద్యార్థిని తల్లి



తీరని అన్యాయం..



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటం విద్యార్థులకు అన్యాయం చేయటమే. సీట్లను అమ్ముకునేందుకే ఈ ఆలోచన చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేటగిరీల వారీగా సీట్లు కేటాయించటం ఒక తప్పయితే ప్రస్తుతం ప్రైవేటీకరించాలని ఆలోచన చేయటం విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేయటమే. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

– భోగాది ప్రేమిక శ్రీనాగ నిర్మల,
నీట్ రాసిన విద్యార్థిని, మచిలీపట్నం

కొండంత నష్టం.. గోరంత సాయం

రూ. లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వాణిజ్య పంటలు వరదలతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అన్నదాతలకు రూ.వందల కోట్ల నష్టం వాటిల్లింది. చంద్రబాబు ప్రభుత్వం వారికి మొక్కుబడిగా ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించి చేతులు దులుపుకొనేందుకు సిద్ధమైంది. పంట దెబ్బతిన్న ప్రతి ఎకరాకు రూ. 20 వేలకు తగ్గకుండా నష్ట పరిహారం ఇవ్వాల్సిందేనని చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో డిమాండ్ చేశారు. ఇప్పుడు ఆయన సర్కారే ఉన్న నేపథ్యంలో ఇంకా ఉదారంగా తమను ఆదుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

- 4,614.90 హెక్టార్లలో పంటలు నీట మునక
- వీటిలో 11,537 ఎకరాలు వాణిజ్య పంటలు
- రైతులకు రూ. 200 కోట్ల మేరకు భారీ నష్టం
- బాబు సర్కార్ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.10.60 కోట్లు!
- బాధిత అన్నదాతల్లో 90 శాతం మంది కౌలుదారులే
- సీఎం ప్రకటనతో ప్రయోజనం శూన్యమని తీవ్ర ఆవేదన
- వంచించకుండా అన్నివిధాలా అండగా నిలవాలని వినతి



వరదకు దెబ్బతిన్న పసుపు సాగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వరద నీటిలో చిక్కుకొని జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో 4,614.90 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. వీటిలో 11,537.25 ఎకరాల్లో వాణిజ్య పంటల సాగు దెబ్బతింది. పసుపు, అరటి, కంద, జామ, తమలపాకు, సన్న నిమ్మ, పామాయిల్, బొప్పాయి, పూలు, కూరగాయల పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. రూ. 200 కోట్ల మేర నష్టం వాటిల్లింది. మొత్తం 8,468 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. వీరిలో 90 శాతం మంది కౌలుదారులే. ఎకరం రూ. 50 వేలకుపైగా చొప్పున కౌలు చెల్లించి సాగు చేస్తున్నారు.

పెట్టుబడులే భారం

కంద పంటకు ఎకరాకు రూ. 2.50 లక్షల పెట్టుబడి పెట్టారు. పసుపు, అరటి, జామ, కూరగాయలు, బొప్పాయి పంటలకు రూ. 1.50 లక్షలు ఖర్చు చేయగా.. తమలపాకు పంటకు రూ. 2 లక్షల వరకు పెట్టారు. ఈ లెక్కన 1,473.8 హెక్టార్ల అరటి సాగుకు రూ. 55.26 కోట్లు పెట్టుబడి అయింది. 1,338.4 హెక్టార్ల పసుపు సాగుకు రూ. 50.19 కోట్లు, 820.8 హెక్టార్ల కంద సాగుకు రూ. 51.30 కోట్లు, 135.40 హెక్టార్ల తమలపాకు సాగుకు రూ. 6.76 కోట్లు, 57.5 హెక్టార్ల జామ సాగుకు రూ. 2.16 కోట్లు, 175 హెక్టార్ల కూరగాయల సాగు కోసం రూ. 6. 55 కోట్లు చొప్పున రైతులు వెచ్చించారు. మొత్తం రూ.172. 23 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇవి కాకుండా వెయ్యి ఎకరాల్లో సాగైన సన్న నిమ్మ, బొప్పాయి, బెండ, పూలు తదితర పంటల సాగుకు సుమారు రూ. 30 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ లెక్కన మొత్తం వాణిజ్య పంటలకు రూ. 200 కోట్లకు తగ్గకుండా రైతులు ఖర్చు చేశారు.

మొక్కుబడిగా సహాయం

రాష్ట్ర విపత్తుల విభాగం నిబంధనల మేరకు వాణిజ్య పంటలకు హెక్టారు అరటికి రూ. 25 వేలు, కంద, పసుపునకు రూ.18 వేలు, నిమ్మకు రూ.22 వేలు, కూరగాయలకు రూ.18 వేలు, తమలపాకు (ఎకరాకు) రూ. 30 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఎకరా అరటికి పరిహారం రూ.10 వేలు మాత్రమే రైతుకు రానుంది. పసుపు, కంద, కూరగాయలకు రూ. 7,500, నిమ్మకు రూ. 8,500 మాత్రమే వస్తుంది. చంద్రబాబు సర్కార్ ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.10.60 కోట్లు మాత్రమే ప్రకటించింది. ఎకరాకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిన తమకు మొక్కుబడిగా పరిహారం ఇవ్వనుండడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దెబ్బతిన్న కంద పంట

పంట పేరు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	బాధిత రైతుల సంఖ్య
కొల్లూరు మండలంలో...		
అరటి	915.80	1,974
పసుపు	848.40	1574
కంద	464.80	862
తమలపాకు	135.40	420
కూరగాయలు	113	290
కొబ్బరి	30	20
పూలు	8	13
జామ	7.50	6
బొప్పాయి	5	8
పామాయిల్	4	4
భట్టిప్రోలు మండలంలో...		
అరటి	550	861
పసుపు	490	810
కంద	356	575
కూరగాయలు	56	41
జామ	50	110
బొప్పాయి	4	6
నిమ్మ	3	2
చుండూరు మండలంలో...		
నిమ్మ	560	860
అరటి	8	14
కూరగాయలు	6	18
మొత్తం	4,614.90	8,468

పరిహారం పెంచితేనే న్యాయం



అర ఎకరంలో అరటి, 1.50 ఎకరాలలో పసుపు పంట సాగు చేశా. రెండు పంటలకు ఇప్పటి వరకు రూ. 2 లక్షలు పెట్టుబడుల రూపంలో ఖర్చయ్యాయి. పంట చేతికొస్తే ఇబ్బందులు తొలగుతాయని పెట్టుకున్న ఆశలు కృష్ణా వరదతో గల్లంతయ్యాయి. వాణిజ్య పంటల సాగుకు అధిక పెట్టుబడులు పెట్టి నష్టాలకు గురైన మమ్మల్ని ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆదుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీని భారీగా పెంచి ఇచ్చి న్యాయం చేయాలి.

– యడ్లపల్లి శివనాగేశ్వరరావు,
ఈపూరులంక, కొల్లూరు మండలం

ఉదారంగా ఆదుకోవాలి



కంద పంట మరో రెండు నెలల వ్యవధిలో చేతికొస్తుందన్న ఆశతో ఉన్నాం. భారీగా పెట్టుబడులు పెట్టాం. 3 ఎకరాల భూమిలో ఎకరంలో కంద, మిగతా పసుపు సాగు చేశాం. ఇప్పటికే కౌలుతో కలుపుకొని పెట్టుబడుల కింద రూ. 4 లక్షలు ఖర్చు వచ్చింది. కందకు మంచి ధర ఉండటంతో పంట ఆదుకుంటుందన్న తరుణంలో సంభవించిన వరదలతో పూర్తిగా నష్టపోయి కుదేలయ్యాం. ప్రభుత్వం స్పందించి పరిహారాన్ని భారీగా పెంచాలి. వీలైనంత ఉదారంగా మమ్మల్ని ఆదుకోవాలి.

– ఉప్పు నరేష్, పెదలంక, కొల్లూరు మండలం

ప్రభుత్వం ఎంత ఇచ్చినా తక్కువే



ఇంతటి ఘోర విపత్తు ఎన్నడూ చూడలేదు. పంట నష్టపోయిన రైతులకు జరిగిన నష్టానికి పరిహారంగా ప్రభుత్వం ఎంత ఇచ్చినా సరిపోదు. కంద 5, పసుపు 3, అరటి 4 ఎకరాలలో సాగు చేశాను. ఇందులో నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. అంతా ఊడ్చుకుపోయింది. కౌలు ఎకరాకు రూ.55 వేల చొప్పున చెల్లించా. కంద పుట్టి రూ.1200 వంతున 120 పుట్టీల విత్తనం నాటాం. వరద దెబ్బకు మొత్తం నష్టపోయాం.

– నిమ్మగడ్డ పురుషోత్తం,
చింతమోటు, భట్టిప్రోలు మండలం

పంటలన్నీ నాశనం



అరెకరం చొప్పున అరటి, పసుపు పంటలు వేశా. 2009లో వచ్చిన వరద కన్నా ఇప్పుడు ముంపు మూడు అడుగుల మేర ఎక్కువగా ఉంది. పంటలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఎరువులు, మందులకు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాం. ఇంతలో వరద ముంచుకురావడంతో పంటలన్నీ నాశనం అయ్యాయి. రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. ప్రభుత్వం మా వంటి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. పరిహారం వెంటనే ప్రకటించాలి.

– కొమ్మినేని వెంకటేశ్వరరావు,
చింతమోటు, భట్టిప్రోలు మండలం

న్యూస్‌రీల్

వీవీఐపీలు తిరిగే రోడ్డుపై మురుగు నీరు తిష్ట



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో వీవీఐపీలు తిరుగుతున్న రహదారులపై సైతం మురుగునీరు నిల్వ ఉంటోంది. కనీసం కార్పొరేషన్ అధికారులు కూడా బయటకు పంపించే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. ప్రకాశం బ్యారేజీకు 500 మీటర్ల దూరంలో అమరావతి కరకట్ట మధ్యలో రోడ్డుపై భారీగా మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి రోజూ ఈ రహదారిలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రాకపోకలు సాగిస్తారు. ఇలాంటి రహదారులను కూడా శుభ్రం చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రేపు ఆచార్య బేతవోలుకు జాతీయ సాహితీ పురస్కారం

గుంటూరు వెస్ట్: సంస్కృతి, అజో-విభొ-కందాళం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సర్రాజు బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వక్తలుగా పిన్నమనేని మృత్యుంజయ రావు, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, వెలువోలు నాగరాజ్యలక్ష్మి తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంస్కృతాంధ్ర భాషల్లో విశేష పాండిత్యం గడించారని వివరించారు. ఉన్నత విద్యావంతుడిగా, గురువుగా పలు విశ్వవిద్యాలయాల్లో అనేక మంది శిష్యులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. దీంతోపాటు సాహిత్యం, రచనల్లో తనదైన ముద్రతో గుర్తింపు పొందారని బాలచంద్ర తెలిపారు.

పారదర్శకంగా దెబ్బతిన్న ఇళ్ల సర్వే

అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: వరద విపత్తుతో దెబ్బతిన్న గృహాల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. లంక గ్రామాలలో ఇంటింటి సర్వేపై స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కృష్ణా నది వరదకు బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలు అధికంగా దెబ్బతిన్నాయని కలెక్టర్ తెలిపారు. 24 లంక గ్రామాలలోని నష్టాన్ని సర్వేలో క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఇందుకోసం నూతన యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. వరదకు దెబ్బతిన్న ప్రతి ఇంటిని సర్వే సమయంలో ఫొటో తీయాలని, యజమాని ఫొటో కూడా తీసుకోవాలని సూచించారు. దెబ్బతిన్న గృహం వివరాలు స్పష్టంగా పొందుపరచాలన్నారు. ఆ ఇంటిలో టీవీ, ఫ్రిజ్ పాడైతే వాటి కంపెనీ పేర్లు సహా నమోదు చేయాలని పేర్కొన్నారు. వాహనాలు పాడైతే యాప్‌లో ఫొటోలు పెట్టాలని, సదరు వాహనం కంపెనీ పేరునూ నిక్షిప్తం చేయాలన్నారు. ప్రాథమికంగా 13 పక్కాగృహాలు దెబ్బతినగా, 163 కచ్చా ఇళ్లు, మరికొన్ని నివాసాలు ధ్వంసం అయ్యాయని చెప్పారు. జీవనోపాధి కోల్పోయి ఉంటే వాటి ఫొటోలను తీసి యాప్‌లో పంపాలన్నారు. పశువులకు సంబంధించిన షెడ్ల వివరాలు పొందుపర్చాలని సూచించారు. లంక గ్రామాలలో కొందరికి ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు లేవని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. యుద్ధప్రాతిపదికన వారికి వాటిని ఇప్పించాలని ఆదేశించారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. బాధితులకు మేలు జరిగేలా పనిచేయాలన్నారు. ప్రతి గంటకు ఎన్ని గృహాలలో సర్వే పూర్తయిందో వివరాలు పంపాలని ఆదేశించారు. సచివాలయాలలోని 11 మంది సిబ్బంది మొత్తం సర్వే పనుల్లో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. వీక్షణ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



పోలీసులకు సూచనలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల టౌన్: స్ట్రయిట్ కట్ కరకట్టలపై అక్రమంగా ఇసుకను తవ్వి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఏఎస్పీ విఠలేశ్వర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం చీరాల మండలంలోని విజయలక్ష్మీపురం, బుర్లవారిపాలెంలోని స్ట్రయిట్ కట్ కరకట్ట వద్ద ఇసుక అక్రమంగా తవ్విన ప్రాంతాలను డీఎస్పీ జగదీష్ నాయక్, తహసీల్దార్ గోపీకృష్ణ, డ్రైనేజీ ఏఈ పురుషోత్తంలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కరకట్టలపై అక్రమంగా ఇసుకను తవ్వి, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ప్రభుత్వం సూచించిన స్టాక్ పాయింట్లలో నిబంధనల ప్రకారం ఇసుకను లోడ్ చేయించి, తగిన రశీదులతో రవాణా చేసుకోవాలన్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖలతో కలిసి సంయుక్తంగా 24 గంటలు తనిఖీలు చేస్తామన్నారు. కట్టల నుంచి ఇసుకను తరలించడం వల్ల భారీ వర్షాల సమయంలో స్ట్రయిట్ కట్ సమీపంలోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రూరల్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై శివకుమార్, మండల సర్వేయర్ చార్లెస్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు వస్తేనే అభివృద్ధి పనులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- 15వ ఆర్థిక సంఘ నిధుల్లో కేటాయింపులు
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆవేదన
- టీడీపీ నాయకులే వేదికలు ఎక్కుతున్నారని విమర్శ
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సమస్యలు ఏకరువు



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే అభివృద్ధి పనులు చేపడతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా చాంబర్‌లో ఆమె అధ్యక్షతన ప్రణాళిక-ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యంపై 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధుల్ని విడుదల చేస్తేనే అభివృద్ధి పనులు చేపట్టగలమని పేర్కొన్నారు. ఇప్పటికే గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులకు ప్రాధాన్యతా క్రమంలో పనులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని పూర్తి చేయించాలని సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారుల్ని ఆదేశించారు.

జెడ్పీటీసీ సభ్యుల ఆవేదన

స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు తమ మండలాల్లో సమస్యలను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతో పాటు ప్రభుత్వ శాఖల అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. మండలాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారామని, ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన చెందారు. జూన్‌లో జరిగిన పాఠశాలల ప్రారంభ సమయంలో విద్యాకానుక కిట్ల పంపిణీకి హెచ్ఎంలు, ఎంఈవోలు తమను ఆహ్వానించలేదని వాపోయారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తమకు సరైన గౌరవం దక్కడం లేదని తెలిపారు. భట్టిప్రోలు మండలంలో ఏర్పాటు చేసిన సీఎం కార్యక్రమానికి సైతం తనకు ఆహ్వానం లేదని ఓ జెడ్పీటీసీ సభ్యుడు వాపోయారు. దీనిపై హెనీ క్రిస్టినా స్పందిస్తూ.. ఎంపీడీవోలతోపాటు ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని డిప్యూటీ సీఈవో జె.మోహనరావుకు సూచించారు.

టీడీపీ నాయకులకు పెద్దపీట

టీడీపీ పాలన మొదలైన తరువాత తమ పరిస్థితి మరీ ఘోరంగా మారిందని పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వెళ్లగక్కారు. తమను పక్కన పెట్టి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక టీడీపీ నాయకులే వేదికలపైకి ఎక్కుతున్నారని తెలిపారు. ఎంపీడీవోలతోపాటు వివిధ శాఖల అధికారుల సమక్షంలోనే టీడీపీ నాయకులకు పెద్దపీట వేసి, తమను అవమానిస్తున్నారని విమర్శించారు. భారీ వర్షాలకు గ్రామాల్లో రోడ్లు భారీగా దెబ్బతిన్నాయని, వాటికి తక్షణం మరమ్మతులు చేయించాలని కోరారు. కృష్ణానది వరద ప్రభావానికి గురైన లంక గ్రామాల్లో నీరు వెళ్లిపోయిన తరువాత కనీసం బ్లీచింగ్ చల్లే పరిస్థితి కూడా లేదని భట్టిప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు సమావేశం దృష్టికి తెచ్చారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా వ్యవసాయంపై జరిగిన 3వ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై జరిగిన 5వ సమావేశానికి పిల్లా ఉమా ప్రణతి అధ్యక్షత వహించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, జెడ్పీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

కోస్టల్ సెక్యూరిటీ సౌత్ డీఎస్పీ బాలరాజు

చీరాల టౌన్: తీర ప్రాంతాల్లో నిర్వహించే వినాయక నిమజ్జనాలకు తగిన బందోబస్తు ఏర్పాటు చేశామని కోస్టల్ సెక్యూరిటీ సౌత్ డీఎస్పీ బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపట్నం గ్రామాలను సందర్శించారు. ఆయా పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిమజ్జనం, శాంతిభద్రతలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కొత్తపట్నం మెరైన్ ఎస్సై పి. సుబ్బారావు, ఏఎస్సై రాంబాబు పాల్గొన్నారు.



తీరంలో సిబ్బందితో డీఎస్పీ బాలరాజు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య రాళ్ల దాడి

యద్దనపూడి: యద్దనపూడి మండలంలోని గురువారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు పోలీసుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. సూరవరపుపల్లి గ్రామంలో టీడీపీ వర్గానికి చెందిన వారు వినాయక నిమజ్జనం కోసం వెళ్తున్న సమయంలో కొందరు వైఎస్సార్ సీపీ వర్గీయులను దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో వివాదం జరిగింది. ఇరు వర్గీయులను పోలీసులు కట్టడి చేశారు. ఈ ఘర్షణలో వైఎస్సార్ సీపీకి చెందిన సన్నెబోయిన వీరయ్య, సన్నెబోయిన వాసుకు గాయాలయ్యాయి. వీరు మార్టూరు, చీరాల ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని, ముందస్తు జాగ్రత్తగా పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ జీఎల్ శ్రీనివాసరావు, ఎస్సై రత్నకుమారి తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఇరు వర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

18న రాష్ట్ర, జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర, జాతీయ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాల ఆటల పోటీల కార్యదర్శి ఈ చింపారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక కార్యక్రమం ఈ నెల 18వ తేదీన కందుకూరులో టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒంగోలులో ఏబీఎం జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్ తక్రా ఆటలకు సంబంధించి ఈ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఉంటాయన్నారు. విద్యార్థులు తమ పాఠశాల హెచ్‌ఎం, కళాశాల ప్రిన్సిపాల్ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్, 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ వెంట తేవాలని కోరారు. వివరాలకు 98481 25706, 94406 21579 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు రద్దు

జే.పంగులూరు: ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పంగులూరు జూనియర్ కళాశాలలో జరగాల్సిన 34వ సబ్‌జూనియర్స్ బాల, బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రకృతి విపత్తులు, పలు రైళ్ల రద్దు కారణంగా రద్దు చేశారు. 13 జిల్లాల సంఘ కార్యదర్శుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన డైరెక్ట్ నేషనల్ సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు చొప్పున బాలురు, బాలికలు పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన వారికి పంగులూరు జూనియర్ కళాశాలలో శిక్షణ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయని రాష్ట్రస్థాయి ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి, అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశీవిశ్వనాథరెడ్డి, కే భాస్కర్ తెలిపారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం


పోటీల విజేతలను అభినందిస్తున్న ఏవీవీ స్కూలు యాజమాన్యం

బాపట్ల: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.వెంకటేశ్వర్లు సూచించారు. వికసిత్ భారత్‌లో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను స్థానిక ఏవీవీ స్కూలులో శుక్రవారం నిర్వహించారు. ఇందులో జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక స్పృహతో ముందుకుపోవాలని సూచించారు. వక్తృత్వ పోటీలలో జే పంగులూరు మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి జి. మురళీకృష్ణ సాయిరాం ప్రథమ స్థానంలో నిలిచాడు. కొల్లూరు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు చెందిన బి.దివ్య తేజశ్రీ ద్వితీయ స్థానం, నగరం మండలం ఉల్లిపాలెం ఏజెడ్‌పీహెచ్‌ఎస్‌కు చెందిన జి. కవిత తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. వ్యాసరచన పోటీలలో నగరం మండలం ఉల్లిపాలెం ఏజెడ్‌పీహెచ్‌ఎస్‌కు చెందిన కె.లక్ష్మీ సింధూర, తిమ్మాయపాలెం పాలెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఏ తన్మయి, నిజాంపట్నం బీసీ వెల్ఫేర్ స్కూలుకు చెందిన డి.రవి కిషోర్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా సరస్వతి మెమోరియల్ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎస్కేఎస్ జాన్ సైదా, పి. రమ్యలత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఐసీహెచ్ డేనియల్, ఏవీవీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని వై. సత్యవతి వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యం పిల్లల సంరక్షణకు చర్యలు

జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తమరావు


చినగంజాంలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా అధికారులు

చినగంజాం: కన్నబిడ్డలను పోషించలేని స్థితిలో పసికందును సైతం విక్రయించేందుకు పూనుకున్న సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన పిల్లల సంరక్షణకు ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పీ పురుషోత్తమరావు అన్నారు. చినగంజాం మండలంలోని జాలమ్మ కాలనీలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం ఇంటికి జిల్లా బాలల సంరక్షణాధికారులు పీ పురుషోత్తమరావు, జీ కృష్ణ, ఇంకొల్లు ఐసీడీఎస్ సీడీపీఓ టీ ఝాన్సీ, సిబ్బంది శుక్రవారం వచ్చారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. పసికందును విక్రయించారనే విషయమై గుంటూరులో కేసు నమోదు కావడంతో గుంటూరు బాలల సంరక్షణ కేంద్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు విచారణ నిర్వహించారు. సుబ్రహ్మణ్యంతోపాటు ఆయన బంధువులు, ఇరుగుపొరుగు వారితో మాట్లాడారు. సుబ్రహ్మణ్యం దంపతుల ఎనిమంది మంది పిల్లలు ఎలా ఉన్నారు, వారి సంరక్షణ, స్థితిగతులు వంటి విషయాలను తెలుసుకున్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పీ పురుషోత్తమరావు తెలిపారు. సుబ్రహ్మణ్యం దంపతులకు ఇప్పుడు పుట్టిన పాపతో కలిపి 9 మంది సంతానం ఉన్నారు. వారిలో ఐదుగురు అమ్మాయిలు. పెద్దవారైన మగ పిల్లలు ఇద్దర్ని గొర్రెలు కాసే పనిలో కుదిర్చినట్లు గుర్తించారు. మిగిలిన ఇరువురు మగపిల్లలు తండ్రి వద్ద ఉంటున్నట్లు గుర్తించారు. గుంటూరు శిశు సంరక్షణ కేంద్రంలో పుట్టిన పాప ఉండగా, తండ్రి దగ్గర ఉన్న ఆడపిల్లల్లో పెద్దపాప మినహా ముగ్గుర్ని బాపట్ల జిల్లా శిశు సంరక్షణ కేంద్రం బాలికా సదన్‌లో చేర్పించాలని అధికారులు తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బిడ్డల తల్లి లక్ష్మి అంత్యక్రియలు పూర్తయిన తరువాత కుటుంబ సభ్యులతో చర్చించుకొని వారిని చేర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే వాణిశ్రీ, మహిళా సంరక్షణాధికారి నాయుడు మీనాక్షి, ఏఎన్ఎం జే సువార్త, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. హైమావతి, బీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

ఏపీ రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

రేపల్లె రూరల్: చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జీవీ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి చేనేత కుటుంబానికి ఆరోగ్య బీమా ద్వారా రూ.2,100 చొప్పున ప్రభుత్వం ప్రీమియం చెల్లించనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 1,22,864 చేనేత కుటుంబాలకు రూ.25.76 కోట్లు చెల్లించనుందని తెలిపారు. తద్వారా రూ.10 వేల విలువైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. కుటుంబంలోని భార్య, భర్త, ఇరువురు చిన్నారులు వైద్యసేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

పట్నంబజారు: ఆర్టీసీ పరిధిలోని పలు డిపోల్లో ఖాళీగా ఉన్న స్థలాల్ని 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం ఎం. రవికాంత్ తెలిపారు. ఈ నెల 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, 29 వరకు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన వాటిని ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల్లోపు నెల్లూరులోని ఈడీ కార్యాలయంలో టెండర్ బాక్సులో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తెరుస్తారని తెలిపారు. పెదకాకాని పరిధిలో 2178 చదరపు గజాలు, కాకానిలోని బస్టాండ్ వద్ద 2014 చదరపు గజాలు, పెదకాకాని పరిధిలో మూడో బిట్ 1208 చదరపు గజాలు, తెనాలిలోని రామలింగేశ్వరపేటలో 7260 చదరపు గజాల రెండు బిట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ నెల 24న ఎన్టీఆర్ బస్టాండ్ గుంటూరులో నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరుకావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.apsrtc.ap.gov.in లో చూడాలని సూచించారు.

విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో వృత్తిలో నిపుణత సాధించాలి

పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్


బాలునాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక భారతదేశపు ఇంజినీరింగ్ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో వృత్తిలో ఇంజినీర్లంతా నైపుణ్యం సాధించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలు నాయక్ తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీలో పీఆర్ ఎస్ఈ జి. బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈఎన్‌సీ బాలునాయక్ మాట్లాడుతూ దేశంలో ఆధునిక నిర్మాణాలకు పునాది వేసిన విశ్వేశ్వరయ్య సేవలను గుర్తు చేసుకుని, ప్రస్తుత తరం ఇంజినీర్లు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విశ్రాంత ఎస్ఈ వీవీ మురళీకృష్ణమనాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను రేషనలైజేషన్ చేయాలని, వారి న్యాయమైన హక్కులను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏపీపీఆర్ఏ అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని 26ఏళ్లుగా జెడ్పీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 25 మంది పీఆర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రక్తదానం చేశారు. ఉద్యోగులకు బీపీ, షుగర్, టెస్టులు నిర్వహించారు. జెడ్పీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. డాక్టర్ పి. నాగ హరిత గుండె జబ్బులపై జాగ్రత్తలను వివరించారు. టెక్నికల్ సెషన్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం బాలునాయక్‌ను పంచాయతీరాజ్ ఇంజినీర్లు సత్కరించారు. మూడు జిల్లాల పీఆర్ ఇంజినీర్లు జింకా రమేష్, అశోక్, సుబ్బరాయుడు, డిప్లొమా ఇంజినీర్స్ ప్రధాన కార్యదర్శి రత్న ప్రసాద్, ఏపీపీఆర్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, బీడీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంఎస్ఎస్ ప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వీరారెడ్డి, రజనీకాంత్, ముత్తయ్య, నరసరావుపేట జిల్లా అధ్యక్షుడు వై.వి. రమేష్, హెడ్‌క్వార్టర్స్ డీఈ పాల్, జయరాజు, అజయ్ పాల్గొన్నారు.

17న బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను ఈ నెల 17న స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1, 2009 తర్వాత జన్మించిన బాలురు పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఆధార్‌తో పాటు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, వైట్ డ్రెస్‌తో పాటు సొంత కిట్‌ను తీసుకురావాలని ఆయన తెలిపారు.

జాతీయ పోటీల్లో కొండమంజులూరు విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల బోధన సిబ్బంది, గ్రామ పెద్దలు

జే.పంగులూరు: జాతీయ స్థాయి పోటీల్లో కొండమంజులూరు విద్యార్థిని ప్రతిభ చాటింది. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టులో 'మోంట్రియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. దీనికి సంబంధించిన ఫలితాలను శుక్రవారం ఢిల్లీలో ప్రకటించారు. బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని కొండమంజులూరు రావుల జానకీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పంచుమర్తి భవ్య ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు ఇమ్మిడిశెట్టి అనిత తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు సమష్టి కృషితో బాలిక ఘన విజయాన్ని సాధించినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గోలి సంధ్య, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, ప్రధానోపాధ్యాయులు అనిత, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యాశాఖ అధికారులు కే నాగభూషణం, వీరాంజనేయులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

రెగ్యులర్ చేసే వరకు ఆందోళన ఆగదు

- జీజీహెచ్‌లో కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన
- వైద్యసేవలు నిలిపివేస్తామని హెచ్చరిక


జీజీహెచ్‌లో నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు తెలిపారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విధులు బహిష్కరించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేతబట్టుకుని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్‌ను 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన పోస్టుల్లో ఏఎన్ఎంలను సర్దుబాటు చేసేలా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే సోమవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరి, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

పార్వతీపుత్రా.. పాహిమాం

7వ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి గణపతిని పూజిస్తున్న మహిళా భక్తులు

సత్తెనపల్లి: వినాయక నవరాత్రుల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లో గల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో వినాయక నవరాత్రులు కోలాహలంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా 7వ రోజు శుక్రవారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద గోత్ర నామాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీ సత్యసాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయి తేజ రాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల


సమావేశంలో మాట్లాడుతున్న స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మండల, నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల షెడ్యూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈమేరకు మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటల పోటీల షెడ్యూల్ వివరాలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మండల స్థాయి పోటీలను ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయి పోటీలను ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయికి ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం, యోగ, బాడ్మింటన్ క్రీడలు, మిగిలిన క్రీడాంశాలలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. అండర్-14 విభాగంలో పాల్గొనే వారు 2011 జనవరి ఒకటో తేదీ తర్వాత, అండర్-17 విభాగంలో పాల్గొనే వారు 2008 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలన్నారు. విద్యార్థులు తమ అర్హతకు సంబంధించిన పత్రాలతో ఆటల పోటీలకు హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

నేటి నుంచి ఉపాధ్యాయులకు పోటీలు


కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

నరసరావుపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఆఫీసు బేరర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1974 ఆగస్టు 10న ఏర్పాటైన యూనియన్ 50ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా డిసెంబరు నెలలో కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులకు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జీవో 117 రద్దు చేయకుండా చేసిన సర్దుబాటు బదిలీలు నిష్ప్రయోజనం అన్నారు. సర్దుబాటు పేరిట సుమారు 75 కిలోమీటర్ల దూరం వరకు బదిలీలు చేశారన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి జి.విజయసారధి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. శనివారం నుంచి మూడు రోజులపాటు పిడుగురాళ్ల, వినుకొండ, చిలకలూరిపేట, గురజాల, నరసరావుపేటల్లో ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, టెన్నీకాయిట్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి జె.వాల్యానాయక్ ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, ఏ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, కె.అజయ్‌కుమార్, టి.వెంకటేశ్వర్లు, కె.ఉషాశౌరిరాజు పాల్గొన్నారు.

ఏపీ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


గొల్లపల్లి నాగేశ్వరరావు

సత్తెనపల్లి: ఏపీ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణంలోని 19వ వార్డు కొత్తపేట భావనారుషినగర్‌కు చెందిన గొల్లపల్లి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావు శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నియామక పత్రాన్ని అందించారు. నాగేశ్వరరావు ఈనెల 11 నుంచి 2029 ఆగస్టు 10 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను నాగేశ్వరరావు అందేలా కృషి చేయగలరని విశ్వసిస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వరరావు నియామకం పట్ల పలువురు హర్షం వెలిబుచ్చారు.

ప్రకాశం, పశ్చిమ గోదావరి మ్యాచ్ డ్రా

ప్రకాశానికి ఏడు, పశ్చిమ గోదావరికి నాలుగు పాయింట్లు


సుమిత్, 100 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 342 పరుగులతో శుక్రవారం మూడో రోజు బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 8 వికెట్లు నష్టానికి 531 పరుగుల చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని జీవీఎస్.సుమంత్ 68 బంతుల్లో 10 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 89 పరుగులు సాధించాడు. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కొలిక్కిరాని షాపుల కేటాయింపు

నరసరావుపేట: ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల కేటాయింపు వ్యవహారం కొలిక్కిరాలేదు. రెండు నెలలుగా షాపులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీని వలన మార్కెట్ యార్డుకు రావాల్సిన అద్దెలు రాక ఇప్పటికే సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. ఖాళీగా ఉన్న షాపులకు వేలం నిర్వహిస్తే వాటిలో పాల్గొని తమ సత్తా చూపించేందుకు జనసేన కార్యకర్తలు సిద్ధపడుతున్నారు. వివరాలను పరిశీలిస్తే..ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా మార్కెట్ యార్డు స్థలంలో 2011లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి దానికి శ్రీ కాసు వెంగళరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ అని కాంగ్రెస్ నాయకులు పేరు పెట్టారు. అప్పటి నుంచి వాస్తవానికి ఎవరు అధికారంలో ఉంటే వారికి చెందిన కార్యకర్తలకే షాపులు కేటాయిస్తున్నారు. 2014 నుంచి 19వరకు టీడీపీ వర్గీయులు ఆయా షాపులను చేజిక్కించుకొని వ్యాపారాలు నిర్వహించగా 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ సీపీ వర్గీయులు షాపులు నిర్వహించారు. మొత్తం 38 షాపులు ఉండగా కింద భాగంలో 20 వరకు ఉన్నాయి. పైభాగంలో ఉన్న ఆరు షాపుల్లో సచివాలయాలు కొనసాగుతున్నాయి. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల వలన బస్టాండ్‌కు ఎదురుగా కిందనే ఉన్న షాపులకే డిమాండ్ అధికంగా ఉంది. కింది షాపులకు నెలకు రూ.3400, పై భాగంలో ఉన్న వాటికి నెలకు రూ.1750 అద్దెగా నిర్ణయించారు. ఆయా షాపులకు వేలం నామకే వాస్తేగా నిర్వహించి కేటాయిస్తారు. దక్కించుకున్న వారు కిందనున్న పది పన్నెండు షాపులను నెలకు రూ.15 వేల నుంచి రూ.30వేలకు అద్దెకు ఇచ్చుకుంటున్నారు. దీని వలన షాపులను దక్కించుకోవాలని కార్యకర్తలు ఆరాటపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే కాంప్లెక్స్‌లో అప్పటివరకు ఉన్నవారిని ఆఘమేఘాలపై ఖాళీ చేయించారు. రెండు షాపుల్లో అధికార టీడీపీ ముద్రతో వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

నెలాఖరుకు వేలం నిర్వహిస్తాం: వి.ఆంజనేయులు, యార్డు కార్యదర్శి

ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు 2021లో చివరి సారిగా షాపులకు బహిరంగ వేలం వేసి కేటాయించారు. అప్పటి నుంచి ఉంటున్న వారు చెల్లించాల్సిన అద్దె బాకీ సుమారు రూ.15లక్షల వరకు ఉంది. నోటీసులు ఇచ్చాం. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి వేలం ద్వారా కేటాయించేందుకు ఉన్న వారిని ఖాళీ చేయించాం. ఇంకా నలుగురైదుగురు ఖాళీ చేయాల్సివుంది. ఈనెలాఖరుకు నోటిఫికేషన్ విడుదల చేసి వేలం నిర్వహించి షాపులు కేటాయిస్తాం.